కరపత్రాలను విడుదల చేస్తున్న సురేష్ కుమార్, రవికుమార్, నవీన్ పాటి

# సంక్షేమ ఫలాలు అందేలా చూస్తాం

## - జెసి డాక్టర్ నవ్య - ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి
## - నివాళులర్పించిన జెసి, ఎమ్మెల్యేలు గౌరుచరిత, దస్తగిరి

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

అట్టడుగు వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని జెసి డాక్టర్ బి.నవ్య తెలిపారు. శనివారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. నగరంలోని స్థానిక ఆర్ఎస్ రోడ్డు కూడలిలో ఆయన కాంస్య విగ్రహానికి జెసి బి.నవ్య, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, ఇతర దళిత ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెసి, ఎమ్మెల్యేలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి జెసి మాట్లాడారు. జగ్జీవన్ రామ్ ఒక విద్యా వేత్త అని, సంఘసంస్కర్త, రాజకీయవేత్త, సామాజిక స్పృహ కలిగిన నాయకుడని కొనియాడారు. మన మధ్య ఆయన లేకపోయినా కూడా ఆయన స్ఫూర్తి మనందరినీ ముందుకు నడిపిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి మాట్లాడారు. ఎస్సీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎస్సీలకు పెద్ద ఎత్తున బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులను పక్కాగా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ రంగ లక్ష్మీదేవి, ఎపిఎస్‌పి బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాష, దళిత ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జెసి నవ్య, సాంఘిక సంక్షేమ జెడి, ఇతర అధికారులు, ప్రజాసంఘాల నాయకులు

**మేరునగధీరుడు జగ్జీవన్ రామ్**

మేరునగధీరుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని కొనియాడారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కోడుమూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ అనంత రత్నం మాదిగ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ ఎన్‌సి.బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా ఛైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

**జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి**

బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని రెక్టార్ ఆచార్య ఎన్‌టికె.నాయక్ కొనియాడారు. రాయలసీమ వర్సిటీలోని విసి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలో రెక్టార్ ఎన్‌టికె.నాయక్‌తోపాటు విద్యార్థులు నివాళులర్పించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆర్‌పిఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో**

ఆర్‌పిఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు పోస్టల్ కాలనీలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎస్‌ఎఫ్ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీ ప్రశాంత్, టౌన్ సెక్రటరీ దివాకర్ మాట్లాడారు. బాబు జగ్జీవన్ రామ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని, సమసమాజ స్థాపనకు కృషి చేసిన కృషీవలుడని కొనియాడారు. ఆర్‌పిఎస్‌ఎఫ్ టౌన్ నాయకులు రోహిత్, చిన్న, సునీల్, నిరంజన్, జయవర్ధన్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు ఎన్‌టికె.నాయక్, అధికారులు

## 13న విద్యా చైతన్య సదస్సు

**- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ఈనెల 13న యుటిఎఫ్ భవన ప్రారంభోత్సవంతో పాటు విద్యా చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి తెలిపారు. శనివారం నగరంలోని స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఈ నెల 13న జరిగే విద్యా చైతన్య సదస్సుకు సంబంధించిన కరపత్రం, ఆహ్వాన పత్రాన్ని రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 13న జరిగే విద్యా చైతన్య సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. అదేవిధంగా యుటిఎఫ్ భవనం ప్రారంభోత్సవంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, జీవిత జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, కౌలన్న, వెంకటేష్, బాబు, లక్ష్మీదేవి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**జగ్జీవన్ రామ్‌ను అవమానించిన**

## విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**- ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబు బాకర్, సాయి ఉదయ్**

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

బాబు జగ్జీవన్ రామ్ అవమానించిన పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబుబాకర్, సాయి ఉదయ్‌లు అధికారులను కోరారు. శనివారం పాఠశాలల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అబు బాకర్, సాయి ఉదయ్ మాట్లాడారు. నగరంలో ఉన్న శ్రీచైతన్య, నారాయణ, ఎస్ఆర్ మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలు భారతదేశ మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సెలవు ఇవ్వకుండా అవమానించినట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల గురించి విద్యార్థులకు చెప్పాల్సిన విద్యాసంస్థలు విద్యార్థులకు మంచి సమాచారాన్ని ఇవ్వకుండా తమ ఖజానాన్ని నింపుకోవడం కోసం తరగతుల నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం సెలవు ఇచ్చినా కార్పొరేట్ విద్యాసంస్థలు ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎవరో ఆయన గురించి తమకు తెలియదని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో అన్నారని తెలిపారు. ఎంతటి దుర్మార్గమైన పరిస్థితుల్లో కార్పొరేట్ విద్యా వ్యవస్థ ఉందో దీనిని బట్టి అర్థమవుతోందని చెప్పారు. కేవలం మార్కులు తెచ్చుకుని డబ్బులు సంపాదించాలని ఆలోచనలో కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తూ చదువులు చెబుతున్నారని తెలిపారు. ఇంతటి దుర్మార్గమైన ప్రవర్తన కలిగి ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలపై కర్నూలు జిల్లా ఆర్ఐఒ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సమాజం గురించి నేర్పే పాఠాలు చెప్పాలని కార్పొరేట్ విద్యాసంస్థలకు హెచ్చరించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు జిల్లా బాలికల కమిటీ సభ్యులు లక్ష్మీ, ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, మల్లేష్, నగర సహాయ కార్యదర్శి పృథ్వి, ఆదిత్య, కర్నూలు నగర కమిటీ సభ్యులు యోగి, ప్రవీణ్, చరణ్, కిరణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

# కనికరం 'కరువు'..!

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 రబీ సీజన్‌కు కరువు మండలాలను ప్రకటించింది. వర్షపాతం, పొడి వాతావరణంతో పాటు సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని కరువు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా కలెక్టర్లు పంపిన ప్రతిపాదన మేరకు ఈ నెల 28న వర్చువల్ ద్వారా సమావేశమైన కరువు ప్రభావ కమిటీ ఆరు జిల్లాల్లో 37 మండలాలను కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో 5 మండలాలు ఎంపిక చేస్తూ రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జిల్లా పశ్చిమ మండలాల్లో తీవ్ర కరువుతో తల్లడిల్లుతున్న పలు మండలాలకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. కర్నూలు జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,17,288 హెక్టార్లు. గత ఏడాది 2023-24 రబీలో 94,391 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తే ఈ ఏడాది 2024-25 రబీ సీజన్‌లో 87,320 హెక్టార్లలో సాగు చేశారు. సాధారణం కంటే 29,968 హెక్టార్లు సాగు తగ్గింది. వర్షపాతం కూడా రబీలో సాధారణం కంటే తక్కువే నమోదు అయ్యింది. పలు మండలాల్లో కనీస వర్షపాతం కూడా నమోదు కాలేదని అధికారులు అంటున్నారు. కరువు కమిటీ సిఫారసు మేరకు అత్యంత తీవ్ర కరువు మండలాలుగా ఆస్పరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి మండలాలను ఎంపిక చేశారు. పత్తికొండను మధ్యస్థ కరువు మండలాల జాబితాలో చేర్చారు. నంద్యాల జిల్లాలో కూడా పలు మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కెసి కెనాల్, ఎస్ఆర్‌బిసి, తెలుగుగంగ, గాలేరు నగరి కాలువల కింద సాగునీటి వసతి ఉన్న మండలాలు కాకుండా ఇతర మండలాల్లో కరువు తీవ్రత అధికంగానే ఉంది. తీవ్ర కరువు మండలాల జాబితాలో కొలిమిగుండ్ల మండలాన్ని మాత్రమే ఎంపిక చేశారు. సాధారణ కరువు మండలాలుగా బేతంచర్ల, బనగానపల్లె, సంజామల, ఉయ్యాలవాడ మండలాలు ఎంపిక చేశారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో వర్షాధారంగా జీవనం సాగించే మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని, వాటిని కూడా ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఉపాధిలో వేతన కష్టాలు :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు చేసిన పనులకు వేతనాల కోసం మూడు నెలల నుండి ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు డిసెంబరులోనే ముగియడం, మండలంలో రబీ సాగు నామమాత్రంగానే వుండడంతో కొద్దిమంది కూలీలకు మాత్రమే పొలం పనులు లభిస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులపైనే ఆధారపడ్డారు. జనవరి మొదటి వారం నుండి చెరువులు, ఇతర సాగునీటి వనరుల్లో పూడికతీత పనులు చేస్తుండగా ఇంతవరకు ఒక్కసారి కూడా వేతనాలు బ్యాంకు ఖాతాల్లో పడలేదు. పండుగకు కూడా కూలి పడలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ సారీ అందని కందిపప్పు:** కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయ లేదు. ఏప్రిల్ నెలలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పునీళ్లకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఉగాది, రంజాన్ పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

**అవీ..ఇవీ..అన్నీ.. :** జిల్లా వ్యాప్తంగా ఉగాది, రంజాన్ పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం కురిసింది. మండే ఎండ నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వాతావరణం చల్లబడింది. దీంతో జిల్లా వాసులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. అయితే కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, మిరప పంటలు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షం దెబ్బ వరి రైతుల మీద కూడా పడింది.

డ్రంకెన్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తున్న సి బెళగల్ ఎస్ఐ తిమ్మారెడి

## డ్రంకెన్ డ్రైవ్ పై అవగాహన

**ప్రజాశక్తి- సి బెళగల్**

డ్రంక్ అండ్ డ్రైవ్ పై సి బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసు సిబ్బంది సమక్షంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడపటం సరి కాదని రోడ్డు భద్రత నియమాలు పాటించుటలో కుటుంబం గుర్తు చేసుకోవాలని అన్నారు. అప్పుడే ప్రమాదాలు జరగవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగటం నేరమని తగు శిక్షలు కూడా ఉంటాయని అన్నారు. అంతే కాకుండా టూ వీలర్ లో ఇద్దరు మాత్రమే ప్రయాణం చేయాలని, ఆటోలలో, ట్రాలీ వాహనాలలో కెపాసిటీకి మించి కూలీలను, ప్రయాణికులను ఎక్కించుకోవడం, అధిక లోడుతో వెళ్లడం ప్రమాదాలకు దారి తీస్తాయని తెలిపారు.

కళారత్న పత్తిఓబులయ్యను సన్మానిస్తున్న టిజి.వెంటేషన్, గౌరిచరిత తదితరులు

## కళారత్న పత్తిఓబులయ్యకు ఘనసన్మానం

**ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మక కళారత్న పురస్కారం అందుకున్న టిజివి కాళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్యను నగర ప్రముఖులందరూ ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథి రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్ మాట్లాడుతూ కళా రంగంలో దాదాపు 27 అవార్డులు పత్తిఓబులయ్య అందుకోవడం చరిత్ర అన్నారు. తెలుగు కళా రంగం గర్వించదగ్గ నటుడు, దర్శకుడన్నారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఒక కళాకారుడుగా అందరి అభిమానాన్ని చూరగొనడం గొప్ప విషయమన్నారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ పత్తి ఓబులయ్య నటుడుగా కళాకారుడిగా, రచయితగా బహుముఖీయ ప్రజ్ఞ గలిగినవారన్నారు. జనసేన పార్టీ శ్రీపతి రమణ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలపాటు ప్రతి ఓబులయ్య సాహిత్య కళా రంగాల్లో కృషి చేయడం అరుదైన విషయం అన్నారు. ఆయన చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. పారిశ్రామికవేత్త బివి రెడ్డి, జనసేన నాయకులు పిబివి సుబ్బయ్య, సోమశేఖర్, ఇనయతుల్లా, మహమ్మద్ మియాలు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ, సంఘాలు, కళాకారులు సన్మానించారు.

## గుండ్రేవులలో ఘనంగా ఉరుసు ఉత్సవాలు

**ప్రజాశక్తి-సి బెళగల్ :** మండలంలోని గుండ్రేవులలో బడేశా ఖాద్రి ఉరుసు మహోత్సవాలు శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లాలో నలు మూలల నుండి భక్తులు పోటెత్తడంతో గ్రామంలో రోడ్లు, వీధులు కిక్కిరిసి పోయాయి. ఎక్కడ అవాంఛనియ సంఘటనలు జరగకుండా ట్రాఫిక్ రద్దీ లేకుండా సి బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. ఇక్కడే భక్తులు ప్రశాంతంగా దర్గా దగ్గరికి చేరుకొని మొక్కులు తీర్చుకొన్నారు.



## గొర్రెల కాపరి ఆత్మహత్య

**ప్రజాశక్తి-మద్దికేర**

ఆర్థిక సమస్యలతో మద్దికేర లోని రైల్వే స్టేషన్ సమీపంలో అగ్రహారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఆంజనేయులు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ విజయకుమార్ నాయక్ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఇంట్లో ఆర్థిక సమస్యలే ఆత్మహత్యకు కారణమని తెలిపారు

## బాబుజగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో సామాజిక ఉద్యమం

**కెవిపిఎస్.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

పరాయి పాలనతో పాటు సామాజిక అసమానతలు కొనసాగుతున్న భారత సమాజంలో పుట్టిన బాబు జగ్జీవన్ రామ్, ఇంతింతై వటుడింతై అన్న చందంగా అంటరాని సమాజానికే రాజకీయ దిక్సూచిగా మారాడని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు తెలిపారు. శనివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని ఆర్ఎస్ కూడలిలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎండి.ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రతిభ లేక ఆధారపడే సమాజం అంటూ ఎగతాళి చేసిన వారికి ఎదురెళ్లి మెరిట్ ప్రాతిపదికన చదువును పూర్తిచేసిన ఘనుడన్నారు. 78 సంవత్సరాలు జీవించిన జగజ్జీవన్ రామ్ పుట్టిన 28 సంవత్సరాలకే రాజకీయ అరంగేట్రం చేసి లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబర్‌గా అయ్యారన్నారు. 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో దేశంలోనే అత్యంత కీలకమైన కార్మిక శాఖ బాధ్యతలు నిర్వహించారన్నారు. సామాజిక తరగతుల సమస్యల పరిష్కారానికై సంఘం పెట్టి తానున్న పార్టీని సైతం ఎదిరించిన ధీరుడన్నారు. భారతదేశ ఉప ప్రధానిగా అఖిలభారత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా సేవలందించారన్నారు. అలాంటి జగజ్జీవన్ రామ్ జయంతి నిర్వహణలో అధికారులు, పాలకుల సైతం వివక్ష చూపినట్లుగా కనపడుతోందన్నారు. జగజ్జీవన్ రామ్ స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారానికై మరింత ఐక్యంగా సమరం కొనసాగించాలని కోరారు. కెవిపిఎస్ కర్నూలు న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు యేసు రాజు, భాస్కర్, ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఆర్.రమణ, ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అబూబకర్, సాయి ఉదయ్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్.చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసిన నివాళ్లు అర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు ఆనంద్‌బాబు, తదితరులు

**కర్నూలు కార్పొరేషన్:** బాబు జగజీవన్ రామ్ పరిపాలనా చతురుడుగా పేరుగాంచారని సీనియర్ న్యాయవాది వై.జయరాజు అన్నారు. కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల ఘనంగా నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వై.జయరాజు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ సందేశం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంలో దీర్ఘకాలంగా క్యాబినెట్ మంత్రిగా వివిధ కోటలను నిర్వహించడం ద్వారా బాబు జగ్జీవన్ రామ్ తన సమర్థవంతమైన నాయకత్వం , పరిపాలనా చతురతను ఎలా నిరూపించుకున్నారో ఆయన గుర్తు చేసుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి ,కార్యదర్శి వెంకరేశ్వర్లు, ఇతర ఆఫీస్ బేరర్లు బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్, ఫోరం నాయకులు ఎ.మాదన్న, నాగప్ప, మహేష్, చంద్రశేఖర్, తిరుపతయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

**సి బెళగల్ :** దేశ సమగ్రతకు బాబు జగిజీవన్ రామ్ ఆదర్శం అని పరిషత్ సూపరిండెంట్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బాబు జగిజీవన్ రామ్ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలతో నివాళులు అర్పించారు.

**గూడూరు:** భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మేధస్సు నుండి స్థాపించిన ప్రజాస్వామ్య వ్యవస్థల శక్తికి బాబు జగ్జీవన్ రామ్ గారి జీవితం ఆధునిక భారత సమసమాజానికి నిదర్శనమని, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రేపల్లె పెద్దబాబు గూడూరు మండల కేంద్రంలో కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు కొమ్ము శేషన్న అధ్యక్షతన బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా జె.మోహన్, ఆర్ పెద్దబాబు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**కర్నూలు హాస్పిటల్ :** కల్లూరు అర్బన్ 31వ వార్డ్ శరీన్ నగర్‌లో బీ క్యాంపు ప్రభుత్వ బిసి హాస్టల్ లో కర్నూలు పట్టణం ఆర్ఎస్ రోడ్ సర్కిల్ లో ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవం వేడుకల్లో భాగంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు. వార్డ్ నాయకులు,అర్బన్ వార్డ్ ల ముఖ్య నాయకులు, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ సిఎస్ రవీంద్ర బాబు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత, నాగేశ్వర్‌రావు రాదవ్

## బాబు జగ్జీవన్ రామ్‌కు హఫీజ్‌ఖాన్ ఘననివాళి

**కర్నూలు క్రైమ్ :** భారతదేశ రాజకీయ, సామాజిక రంగాల్లో సుస్పష్టమైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు బాబు జగజీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమం లో 1వ వార్డు కార్పొరేటర్ షాషావలి, వైసిపి నాయకులు సిహెచ్.మద్దయ్య, కేదార్ నాథ్, జమ్మన్న, సూర్యమోహన్, సూరి, కృపా, ముఖ్యనేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిన్నారిని అభినందిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, పత్తిఓబులయ్య, శమంతకమణి

## ఘనంగా 'సన్‌రిత్ టినిటాట్స్' వార్షికోత్సవం

**ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభా కళా ప్రదర్శనలు**

**ప్రజాశక్తి -కర్నూలుకలెక్టరేట్**

సన్‌రిత్ టినిటాట్స్ ప్రీస్కూల్ లో శనివారం వార్షికోత్సవ వేడుకలు సాంస్కృతిక, క్విజ్ క్రీడా పోటీలతో ఘనంగా జరిగాయి. పాఠశాలలో విద్యార్థులు నృత్యం, సంగీతం, కథ చెప్పడం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యా బహుమతులు, క్విజ్ పోటీ, క్రీడా పోటీ బహుమతులను ముఖ్యఅతిథులు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు వైద్యులు డాక్టర్ శంకర శర్మ, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రాజ శేఖర్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ ఎన్.శమంతకమణి , టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ముఖ్య విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్స్ డాక్టర్ ఎస్.సంజీవ్ , డాక్టర్ అమ్రిత మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత , మెలుకువలు , సాంస్కృతిక అంశాలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పాడతాయాని అన్నారు. భాగస్వాములయిన విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ ఇందిరాశాంతిని సన్మానిస్తున్న నారాయణ స్కూల్ ఎజిఎం,ప్రిన్సిపల్

## నారాయణలో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్** : కర్నూలు మాధవనగర్ లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపల్ మహమ్మద్ ఆల్తాఫ్ అధ్యక్షతన ఈ కిడ్స్, ఈ చాంప్స్ విభాగం గ్రాడ్యుయేషన్ డే సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ప్రభుత్వ పర్మెన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి మాట్లాడారు. విద్యార్థులు కిండర్ గార్టెన్ నుండి ముందుకు సాగుతూ, ప్రాథమిక విద్య, ప్రాథమికోన్నత విద్య యొక్క విస్తృత రంగంలో ధైర్యంగా అడుగులు వేస్తున్నారన్నారు. వారి అభ్యాస ప్రయాణంలో మొదటి ముఖ్యమైన పరివర్తనకు ఆదర్శనంగా నిలుస్తాయన్నారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ ఎ జి ఎం రమేష్ కుమార్, క్లస్టర్ ప్రిన్సిపల్ అన్వర్ బాష, శ్రీని వాసరెడ్డి, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ అరుణ, వైస్ ప్రిన్సిపల్స్ నాగేశ్వరి, రాధ, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ షైనీ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో బయల్దేరుతున్న నాయకులు

## సిపిఎం అఖిలభారత మహాసభలకు నాయకులు

**ప్రజాశక్తి - ఆదోని**

తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో జరుగుతున్న సిపిఎం 24వ అఖిలభారత మహాసభలకు బయల్దేరుతున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ, మండల నాయకులు గోపాల్, వీరారెడ్డి, రామాంజనేయులు, జెల్లి రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆదోని రైల్వే స్టేషన్ నుంచి రైలులో బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మదురైలో ఈనెల 6న వేలాదిమంది రెడ్ షర్ట్ వాలంటీర్ల ప్రదర్శన, లక్షలాదిమందితో బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి భవిష్యత్తు ప్రజా పోరాటాలకు దశా నిర్దేశం కానున్నాయని తెలిపారు. నాయకులు నాగరాజు, వీరేష్, అజీమ్ ఖాన్, వెంకటేష్, మునెప్ప, శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

**- టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు**



మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

**ప్రజాశక్తి - ఆదోని**

టిడిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం మృతుని కుటుంబానికి టిడిపి తరఫున మంజూరైన ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని బసాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మాల వీరేష్ గత ఫిబ్రవరి నెలలో బైక్ యాక్సిడెంట్‌లో మృతి చెందారని తెలిపారు. పార్టీ సభ్యత్వం ఉన్నందున కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమాను నామిని అకౌంట్‌కు జమ చేసినట్లు చెప్పారు. టిడిపి కార్యకర్తల కోసం, వారి సంక్షేమం కోసం యువ నాయకులు నారా లోకేష్ ముందుంటారన్నారు. టిడిపి సీనియర్ నాయకులు రామస్వామి, అప్సర్ బాష, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మదిరే వీరేష్, సుధాకర్ ఉన్నారు.

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు

**- ఎస్ఐ శివాంజులు**

**ప్రజాశక్తి - కౌతాళం**

లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శివాంజులు హెచ్చరించారు. శనివారం మంత్రాలయంలోని రాఘవేంద్ర కూడలిలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు పైబడిన వారు లైసెన్సు కలిగి ఉండి వాహనాలు నడపాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శనివారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

# గుంతల రోడ్డు..!

**- ముళ్లచెట్లు, రాళ్లతో ఉన్న రహదారి - రహదారి నిర్మాణంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం**

**ప్రజాశక్తి - నందవరం**

**హాలహర్వి నుంచి నందవరం వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉంది.భారీ రాళ్లు, గుంతలు, ముళ్ల చెట్లతో నిండి రహదారి దుర్భరంగా తయారైంది. రహదారిని నిర్మించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.**

ముళ్ల చెట్లు, రాళ్లతో ఉన్న రహదారి

నందవరం నుంచి హాలహర్వి వెళ్లే రహదారి చాలా దుర్భరంగా తయారైంది. హాలహర్వి, నందవరం రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే ఈ రహదారి ప్రధానమైంది. సుమారు 500 ఎకరాల పొలాలకు రైతులు వెళ్లటానికి ఈ రహదారి ఉపయోగపడుతుంది. రోడ్డు మార్గం అధ్వానంగా ఉండడంతో రైతులు, ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని నిర్మించడంలో ప్రభుత్వాలు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఇరు గ్రామాల ప్రజలు వాపోయారు. రోడ్డుపై కంప చెట్లు పెరిగి రోడ్డును కమ్ముకున్నాయి. నడిరోడ్డుపై భారీ రాళ్లు ఉన్నాయి. రోడ్డు అడుగడుగునా గుంతలు, చాలా చోట్ల భారీ కోతలకు గురయింది.

భారీ కోతలకు గురైన రహదారి

### వర్షాకాలం పొలానికి వెళ్లడానికి ఇబ్బంది

**- వెంకటేశ్వర్లు, నందవరం**

వర్షాకాలం వచ్చిందంటే మా పొలాలకు వెళ్లడానికి రహదారి ఇబ్బందికరంగా తయారవుతోంది. ఇప్పుడున్న ముళ్లపొదలు వర్షం పడిందంటే మరింత దట్టంగా పెరిగి రోడ్డు కనపడని విధంగా తయారవుతుంది. రోడ్డుపై ఉన్న గుంతలు నీరు నిలిచి బురదమయంగా మారి ఎద్దుల బండ్లు బురదలో ఇరుక్కుపోతున్నాయి. రోడ్డుపై నల్లని మట్టిని వేయడం వల్ల చినుకు పడితే బురదమయంగా మారి అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఉంటుంది. రహదారి మధ్యలో భారీ రాళ్ల ఉండడం వల్ల అక్కడ ఎద్దుల బండ్లు రాళ్లను దాటే సమయంలో పడిపోవడం జరుగుతోంది. మా పొలాలకు వెళ్లడానికి ఈ రహదారి నిర్మాణం చేపట్టాలి.

### 15 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాలి

**- సక్కెర తిక్కయ్య, హాలహర్వి**

నందవరం గ్రామాన్ని చేరుకోవటానికి ఈ రహదారి అనుకూలంగా లేకపోవడంతో ధర్మపురం, ముతి గ్రామాలపైన 15 కిలోమీటర్లు అదనంగా వెళ్లి రావాల్సి వస్తోంది. హాలహర్వి, నందవరం రహదారి భారీ కోతలకు గురికావడంతో చాలా సందర్భాల్లో వాహనాలు అదుపుతప్పి గుంతలో పడిపోతున్నాయి. కార్యాలయాలలో తమ పనుల నిమిత్తం నందవరం గ్రామానికి వెళ్లటానికి ఇబ్బందికరంగా ఉంది. పనుల నిమిత్తం ధర్మపురం, ముగతి గ్రామాలపైన నందవరం గ్రామానికి వెళ్లే సమయంలో ఆ రహదారి హైవే కావడంతో చాలా సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి వ్యక్తులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ఇరు గ్రామాల మధ్య అనుకూలమైన హాలహర్వి, నందవరం రహదారిని నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గి రెండు గ్రామాల మధ్య సత్సంబంధాల బలపడతాయి.

## ఘనంగా శ్రీకవీంద్ర తీర్థుల పూర్వారాధన

**ప్రజాశక్తి - కౌతాళం**

పూజలు చేస్తున్న పీఠాధిపతులు

కర్ణాటక రాష్ట్రంలోని నవ బృందావన గడ్డపై వెలసిన శ్రీకవీంద్ర తీర్థుల పూర్వారాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో శ్రీకవీంద్ర తీర్థుల పూర్వారాధన సందర్భంగా కవీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకవీంద్రతీర్థుల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు.

## ఎస్ఐని కలిసిన రైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి - నందవరం**

నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కేశవ్‌ను రైతు సంఘం నాయకులు శనివారం పోలీసు స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులు సమస్యలతో పోలీసు స్టేషన్‌ను సంప్రదిస్తే న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. రైతులు గ్రామాల్లోనూ, పొలాల దగ్గర తగాదాలకు వెళ్లకుండా స్నేహభావంతో ఉంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రైతుసంఘం నాయకులు దేవపుత్ర, నరసింహులు, దేవరాజు, కెవిపిఎస్ నాయకులు దేవదాసు, వ్యకాస నాయకులు స్వామిదాస్ పాల్గొన్నారు.

ఎస్ఐతో ఉన్న నాయకులు

# మెరుగైన విద్యకు మారు పేరు 'అమరావతి'

**- కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ**

**ప్రజాశక్తి - ఆదోని**

మెరుగైన విద్యకు మారుపేరు అమరావతి పాఠశాల అని కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ తెలిపారు. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని ఉత్సాహ పరుస్తున్నామని చెప్పారు. శనివారం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. చిన్నారి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులు డ్యాన్స్, స్పీచెస్‌తో పాటు నేర్చుకున్న పాఠ్యాంశాలను ఎంతో చక్కగా వివరించారని తెలిపారు. గ్రాడ్యుయేషన్ పట్టాలు పొందిన యుకెజి విద్యార్థులందరూ ఎంతో సంతోషంగా పాటలకు డ్యాన్సులు వేస్తూ తల్లిదండ్రులతో సంతోషంగా గడిపారన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రిన్సిపల్ రాజేశ్వరి మాట్లాడుతూ... పిల్లలు ఎంతో ఉత్సాహంగా అకాడమిక్స్ నేర్చుకున్నారని, నేర్చుకున్న దాన్ని పాటలు, ఆటల రూపంలో ప్రదర్శించారని తెలిపారు. ఇలాగే ప్రతిభ కనబరుస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు పేరు, ప్రతిష్టలు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

చిన్నారి విద్యార్థులతో కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ

## ఖాతాదారులకు మంచి సేవలు

**- శ్రీమహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ అసిస్టెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తల్లమ్ మాధవరావు**

**ప్రజాశక్తి - ఆదోని రూరల్**

శ్రీమహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ద్వారా ఖాతాదారులకు మంచి సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు అసిస్టెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తల్లమ్ మాధవరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. శ్రీమహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ దినాదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. బ్యాంకు పరంగా రూ.262 కోట్ల డిపాజిట్లతో, రూ.183 కోట్ల అప్పులతో, రూ.6.53 కోట్ల నికర లాభాలతో రూ.21.26 కోట్ల రిజర్వ్ నిల్వలతో ఉన్నట్లు చెప్పారు. 0.70 శాతం నిరర్థక ఆస్తులు (నెట్ ఎన్‌పిఎ) కలిగి 54,764 ఖాతాదారులతో పట్టణంలో ప్రథమ బ్యాంకుగా నిలిచిందని తెలిపారు. తమ బ్యాంకు ఆదోని రెవెన్యూ డివి జన్‌లోని ఆస్పరి, ఆలూరు, కోసిగి, హోళగుంద మండలాల్లోని రైతులకు సేవలు అందిస్తున్నం దుకు సంతోషంగా ఉందని చెప్పారు.

## కులం పేరుతో దూషించి దళితులపై దాడి

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

మండలంలోని చిన్నహరివాణం గ్రామానికి చెందిన దళితులు దుర్గప్ప, ఉలిగప్ప, బొజ్జప్పపై కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితులు వాపోయారు. శనివారం వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన కడుబూరు హనుమంతు, కడబూరు నాగరాజు, కడబూరు రవి, కడబూరు రామాంజి, పింజరి అబ్బాస్ అలీలు తమపై కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని వాపోయారు. గ్రామానికి చెందిన డీలర్ షిప్ విషయమై రెవెన్యూ అధికారులు రేషన్ వేయరాదని డీలర్‌కు ఆదేశాలు ఇచ్చారని, అదే విషయాన్ని అడగడానికి వెళ్లిన తమపై అకారణంగా కులం పేరుతో దూషించి దాడి చేశారని తెలిపారు. దాడి విషయంపై ఇస్వి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తమపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు 'చెమట చెక్కిన వాక్యం' పరిచయ సభ

**ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్**

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ కవిత్వ పరామర్శ చెమట చెక్కిన వాక్యం ఆదివారం ఉదయం 10 గంటలకు కర్నూలు నగరంలోని టిజివి కళాక్షేత్రం పరిచయ సభ ఏర్పాటు చేసినట్లు సాహితీ స్రవంతి అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్‌లు తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. సభకు ప్రముఖ రచయిత్రి ఎన్.నాగమణి ఆహ్వానం పలుకుతారని తెలిపారు. ప్రముఖ రచయిత, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఆవిష్కర్తగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విజయ సారథి హాజరుకానున్నారని పేర్కొన్నారు. వక్తలుగా విరసం నాయకులు పాణి, ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.ప్రగతి, తెలుగు కళా స్రవంతి అధ్యక్షులు ఇనాయతుల్లా, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప పాల్గొంటారని పేర్కొన్నారు. సభకు సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు ఎంపి.బసవరాజు సమన్వయకర్తగా వ్యవహరిస్తారని వివరించారు.

# ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆదోనిలో నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోనిలో నివాళులర్పిస్తున్న సంగటి దేవదానం

గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న ఎంపిడిఒ మణిమంజరి

ఆదోని నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**ప్రజాశక్తి - ఆదోని**

బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఆదోనిలో ఘనంగా జరిగాయి. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రాలయం తహశీల్దార్ రవి, డిప్యూటీ తహశీల్దార్ వినీత్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ అశోక్, సీనియర్ సహాయకులు రామచంద్ర, ఖాసీం, డివిజనల్ గణాంకల అధికారి లక్ష్మోజీ ఉన్నారు.

**జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం**

జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం తెలిపారు. కళాశాలలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కులరహిత సమాజం కోసం పాటు పడిన బడుగు, బలహీన వర్గాల నేత, భారత దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. ప్రిన్సిపల్ అబ్దుల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ దేవదాసు, డాక్టర్ సలోమి, సౌజన్య, విజయకుమారి, ప్రీతి ఉన్నారు. అలాగే అరులయ్య వీధిలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు సాంబగల్లు ఎస్.బాలన్న మాదిగ, పిఎస్.వీరేష్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు గోవిందరాజులు మాదిగ, నాగేంద్రప్ప మాదిగ, ఎంఆర్‌పిఎస్ ఎంఎస్‌పి నాయకులు బైచిగేరి తిమ్మన్న మాదిగ, దిబ్బనకల్ ఉసేనప్ప మాదిగ, మాదాసు జగన్ మాదిగ, టి.వీరప్ప మాదిగ, ఎస్.నారాయణ మాదిగ, బి.రాజు మాదిగ, లాలప్ప మాదిగ ఉన్నారు. **కౌతాళం** మంత్రాలయంలో బాబు జగ్జీవన్ రామ్‌కు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. మంత్రాలయంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి కెవిపిఎస్, జైభీమ్ ఎంఆర్‌పిఎస్, ఎంఆర్‌పిఎస్, ఎఐవైఎఫ్ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు, మండల కార్యదర్శి జి.అంజి, అధ్యక్షులు సురేష్, జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ, ఎఐవైఎఫ్ నాయకులు రాజు మాట్లాడారు. జగ్జీవన్ రామ్ ఎన్నో ఆర్థిక ఇబ్బందులను, కుల వివక్షతను ఎదుర్కొని ఉన్నత చదువులు చదివి రాజకీయ రంగాల్లో అనేక కీలక మంత్రి పదవులు అనుభవించినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దళితుల కోసం పోరాటాలు చేసిన ఏకైక వ్యక్తి జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కెవిపిఎస్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు బి.అనిల్, ఎస్.వీరేష్, వైహెచ్‌పిఎస్ నాయకులు వీరేష్, కెవిపిఎస్ మాధవరం నాయకులు చిన్న అంజనయ్య, అశోక్, మండల నాయకులు ఇశ్రాయేలు, జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ, జిల్లా కార్యదర్శి రత్నం, యోహాను, అనిల్ పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రవి డాక్టర్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఎస్ఐ చర్చి సంఘం పెద్దలు ఏబు, కయ్యూన్, ప్రభుదాసు, పేతురు, కె.రాజు, నతానియేలు, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు అమరేష్ రామతీర్థ, డివిజన్ అధ్యక్షులు సుమాల చార్లెస్‌లు బస్టాండ్ ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెవెన్యూ అధికారులు నరసప్ప, తలారి నరసయ్య, బిఎస్ఎస్ నాయకులు చిలకలడోన దేవిపుత్ర, ప్రసన్న కుమార్, రామతీర్థం సుజ్ఞానం, రామతీర్థం దావీదు, మీనుగ లుర్దు, కరుణాకర్, డేవిడ్, నరసప్ప, ఏసురాజు పాల్గొన్నారు. **చిప్పగిరి**లోని ఎస్సీ కాలనీలో ఆర్‌డిటి స్కూల్ దగ్గర జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు జిఎస్.నెట్టికంటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పి.నారాయణ స్వామి, జిఎస్.నాగరాజు, మల్లేష్, చిన్న రాయుడు, రవితేజ, కిలిటన్, మల్లికార్జున, విజయ్ పాల్గొన్నారు. అలాగే మండల కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఇఒఆర్‌డి బాలన్న, ఏపీవో జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **కౌతాళం** ఎమ్మిగనూరులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ కోఆర్డినేటర్ కదిరికోట ఆదెన్న అధ్యక్షతన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ ఎస్.దేవ సహాయం, ఛైర్మన్ పరెగెల భాస్కర్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డి.బాలయ్య, ఉత్సవ కమిటీ వైస్ ఛైర్మన్ రుద్రాక్షల పెద్దయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు జి.ఆనంద్ చైతన్య మాదిగ, మాల ఉసేని, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్, గంజహళ్లి మహదేవ్ మాదిగ, ఎరుకల కృష్ణ, ఎస్.రాజు, సోగనూరు ఆనందరావు, కనకవీడు రాజు, రోజా ఆర్ఫ్ ఉసేని, కలుగొట్ల మాల రాజా రమేష్, రుద్రాక్షల దస్తగిరి, సుమాల ఆంథోని, వివిధ గ్రామాల ప్రతినిధులు గుడికల్ స్వామి దాసు, ఆర్అండ్‌బి ప్రభు కుమార్, కూలూరు ఇసాక్, అల్వాల నాగరాజు, కదిరికోట అశోక్ ఆర్ఫ్, గురజాల దేవరాజు, కె.తిమ్మాపురం మల్లేష్, కందనాతి దేవదాసు, కంబలదిన్నె రాముడు, పూలచింత నగేష్, హాలహర్వి బూదూరు ప్రకాశం, సోగనూరు తిమ్మన్న, గార్లదిన్నె ప్రకాశం, గంగవరం శాంతిరాజు, బనవాసి జేమ్స్, కోటేకల్ బాలస్వామి, కడివెల్ల పరమేష్, ఇబ్రహీంపురం ఏసు రాజు, దేవబెట్ట హనుమంతు, టి.సోమల గూడూరు రాజు, ఎరుకల శివ, సూర్యనారాయణ పాల్గొన్నారు. **ఆస్పరి**లోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జి చిన్న సంజన్న ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి సంజప్ప, ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజనేయులు, తాయ్యన్న, శంకర్, మహనది, కర్ణ, రంగన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని ఎంపిడిఒ కార్యాలయంతో పాటు స్థానిక బస్టాండ్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంత్రి వేడుకలు నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మణిమంజరి జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీవో మహ్మద్ బాష, వెలుగు ఎపిఎం హేమలత, సిసిలు పాల్గొన్నారు. అలాగే కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. సిపిఎం నాయకులు నబి రసూల్, ఆటో యూనియన్ నాయకులు వీరేష్, రాఘవేంద్ర, వీరన్న గౌడ్, రంగస్వామి, జయరాజు, మాబాష పాల్గొన్నారు.

మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న తహశీల్దార్ రవి, తదితరులు

ఆస్పరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

చిప్పగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు